క్లుప్తంగా

ఐటీఐలో వైద్య శిబిరం



నేత్ర వైద్య పరీక్షలు ప్రారంభిస్తున్న ఐటీఐ ప్రిన్సిపాల్ రమణ, వైద్య సిబ్బంది

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్‌లో గల కంచరపాలెం ప్రభుత్వ పారిశ్రామిక బాలికల శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో సోమవారం శంకర్ ఫౌండేషన్, బీఎస్‌ఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. బాలికల ఐటీఐ ప్రిన్సిపాల్ జి.రమణ నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ డి.దత్తు, ఎం.చంద్రశేఖర్ పర్యవేక్షణలో 256 మందికి నేత్ర పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎస్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు బుజ్జి, ఎం.సుజాత, తులసి, పిల్లి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'నేషనల్ ఎలక్ట్రీషియన్స్ డే'



థామస్ ఆల్వా ఎడిసన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎలక్ట్రీషియన్లు

సీతంపేట : విశాఖ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శంకర మఠం రోడ్‌లో గల కార్యాలయం వద్ద 'నేషనల్ ఎలక్ట్రీషియన్స్ డే' సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా థామస్ ఆల్వా ఎడిసన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.మాదన్న, కార్యదర్శి ఆర్.రాము, సభ్యులు, ఎలక్ట్రీషియన్స్ పాల్గొన్నారు.

10 నుంచి నీలమాంబేశ్వరి పరస




అల్లిపురం: అల్లిపురం వాసుల ఆరాధ్య దైవం, యాతపేటలో వెలసిన శ్రీ నీలమాంబేశ్వరి అమ్మవారి పరస మహోత్సవాలు ఫిబ్రవరి 10 నుంచి తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు ఆర్.చంద్రరావు తెలిపారు. ఈ మేరకు ఆలయ కమిటీ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఫిబ్రవరి 10 నుంచి 18 వరకు తొమ్మిది రోజులపాటు అంగరంగ వైభవంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

సీతమ్మధార తహసీల్దార్, ఆర్‌ఐపై చర్యలకు ఫిర్యాదు

సీతమ్మధార : సీతమ్మధార తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అక్రమాలకు పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం వరిసాం గ్రామంలో 6 ఎకరాల 23 సెంట్ల భూమి కాజేసేందుకు జరిగిన కుట్రలో సీతమ్మధార తహసీల్దార్ పాత్ర ఉందని ఆరోపించారు. ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ (ఎఫ్.ఎం.సి) అప్లికేషన్, అఫిడవిట్‌లో సతీ సావిత్రి సంతకం చేసినట్టుగా రామనేని వసంతలక్ష్మి దొంగ సంతకం (ఫోర్జరీ) చేశారని ఆరోపించారు. ఇదే విషయమై తను సంతకం చేయలేదని, ఇందుకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సతీ సావిత్రి డిసెంబర్ 19న సీతమ్మధార తహసీల్దార్‌కు, డిసెంబర్ 23న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. ఈ అంశంపై పూర్తి స్థాయి విచారణ జరిపించాల్సిందిగా భీమిలి ఆర్డీవోకు కలెక్టర్ ఆదేశించారన్నారు. భీమిలి ఆర్డీవో అందుబాటులో లేకపోవడంతో ఇన్‌చార్జి ఆర్డీవో సుధా సాగర్ విచారణ ప్రారంభించారన్నారు. ఈ క్రమంలో జనవరి 6న సీతమ్మధార తహసీల్దార్ రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఒక తప్పుడు నివేదిక తయారు చేసి ఆర్డీవోకు అందజేశారని ఆరోపించారు. ఫోర్జరీ సంతకాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఆకుపచ్చని మణిహారం





- అక్కయ్యపాలెం హైవేపై ఆహ్లాదకరంగా గ్రీన్‌బెల్ట్ ప్రాంతం
- వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లే ఏరియా, షటిల్ కోర్టు ఏర్పాటు
- నూతనంగా ఫ్లవర్ గార్డెన్ అభివృద్ధి
- త్వరలో అందుబాటులోకి బాక్స్ క్రికెట్



పిల్లల ప్లే ఏరియా



కూర్చునేందుకు ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు



ఆకట్టుకుంటున్న రెక్కల గుర్రాలు



హైవే పక్కన గ్రీన్‌బెల్ట్‌లో ఆకట్టుకుంటున్న పచ్చదనం

సీతంపేట : విశాఖ ఉత్తర నియోజకవర్గంలో గ్రీన్‌బెల్ట్ ప్రాంతం జాతీయ రహదారికి మణిహారంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఒకప్పుడు పిచ్చి మొక్కలు, తుప్పలు, శిథిలమైన ఫెన్సింగ్, ఆక్రమణలతో మందుబాబుల అడ్డాగా ఉండే గ్రీన్ బెల్ట్‌లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సరికొత్త అందాలతో ఆహ్లాదాన్ని, ఆరోగ్యానిచ్చే పార్కులుగా తీర్చిదిద్దారు. నియోజకవర్గంలో హైవేకి ఇరువైపులా మణిహారంగా ఉండే గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించి, రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని అందమైన పార్కులుగా అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, చిల్డ్రన్ ప్లే ఏరియా, షటిల్ కోర్టు, ఫ్లవర్ గార్డెన్లు, సిట్ అవుట్స్, లైటింగ్ ఏర్పాటు చేశారు. గ్రీనరీ అభివృద్ధి చేసి సేదతీరే వారికి ఆహ్లాదాన్నిచ్చేలా తీర్చిదిద్దారు. ఆరోగ్యానికి అవసరమైన వ్యాయామం చేసేందుకు ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్‌లు, షటిల్ కోర్టు, పిల్లల ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 44వ వార్డు పరిధిలో అక్కయ్యపాలెం హైవే కూడలి నుంచి పోర్టు ఆస్పత్రి కూడలి వరకు ఉన్న గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి ల్యాండ్ మార్క్‌గా నిలుస్తోంది. నగరంలో మిగిలిన చోట్ల కూడా ఇదే తరహాలో గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

ఆహ్లాదానికి ల్యాండ్ మార్క్

వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారు నగరంలోకి ప్రవేశించడానికి హైవేపై ప్రధాన కూడలి అయిన అక్కయ్యపాలెం జంక్షన్‌లో గ్రీన్‌బెల్ట్ ప్రాంతం బ్యూటిఫికేషన్‌తో ప్రత్యేకంగా ఆకట్టుకోవడంతోపాటు అభివృద్ధికి ల్యాండ్ మార్కుగా నిలుస్తోంది. హైవేపై అక్కయ్యపాలెం కూడలి వద్ద చుట్టూ అభివృద్ధి చేసిన పార్కు, అలాగే సాత్ బస్టాప్ వెనుక ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని, పల్లవి ఎన్‌క్లేవ్ వద్ద జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు చొరవతో బ్యూటిఫికేషన్ పనులు చేపట్టారు. గ్రీన్ బెల్ట్‌లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసి అందమైన మొక్కలు నాటారు. దీనికితోడు సాత్ బస్టాప్ వెనుక గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో పిల్లలు ఆడుకోవడానికి చిల్డ్రన్ ప్లే ఏరియా అభివృద్ధి చేశారు. పిల్లలు ఆడుకోవడానికి స్లైడర్స్, లేడర్స్ ఏర్పాటు చేశారు. మరికొంత భాగంలో షటిల్ కోర్టు నిర్మించారు. గోడలపై అందమైన వాల్ ఆర్ట్ వేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరై నిలిచిపోయిన అభివృద్ధి పనులు ఇటీవల పూర్తి చేశారు. ఇందులో భాగంగా షాదీఖానా రోడ్ సమీపంలో పల్లవి ఎన్‌క్లేవ్ వద్ద గ్రీన్‌బెల్ట్‌లో ఫ్లవర్ గార్డెన్, మధ్యలో వాకింగ్ ట్రాక్, సిట్ అవుట్స్, మధ్యలో బుద్ధ స్టాట్యూ ఏర్పాటు చేశారు. ఇదే ప్రాంతంలో స్థానిక యువత కోరిక మేరకు గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో బాక్స్ క్రికెట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. దీంతో హైవేపై ప్రయాణించే వారికి గ్రీన్ బెల్ట్ ప్రాంతం కొత్త అందాలతో ల్యాండ్ మార్క్‌గా నిలుస్తోంది.



పనులను పర్యవేక్షిస్తున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు

మోడల్‌గా తీసుకోవాలి



అక్కయ్యపాలెం హైవే వద్ద గ్రీన్‌బెల్ట్ అభివృద్ధిని మోడల్‌గా తీసుకుని నగరంలో మిగతా గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని ఆహ్లాదంగా తీర్చిదిద్దాలి. నగరం నానాటికీ కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతోంది. కాసేపు సేద తీరడానికి పార్కులు చాలా దూరంగా ఉంటున్నాయి. వార్డులకు ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే నగరవాసులకు బాగుంటుంది.

– శంకరరావు, అక్కయ్యపాలెం

ఆహ్లాదాన్నిచ్చే పార్కులు



ఒకప్పుడు ఆక్రమణలతో, శిథిలమైన ఫెన్సింగ్‌తో గ్రీన్ బెల్ట్ అస్తవ్యస్తంగా ఉండేది. కార్పొరేటర్ బానాల శ్రీనివాస్ చొరవతో అక్కయ్యపాలెం హైవే కూడలి బాగా అభివృద్ధి చేశారు. స్మార్ట్ బస్‌షెల్టర్లు, గ్రీన్‌బెల్ట్‌లో నాలుగు చోట్ల పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్, షటిల్ కోర్టు, గ్రీనరీ అభివృద్ధి చేశారు. ప్రస్తుతం గ్రీన్‌బెల్ట్ అందంగా మారిపోయింది.

– దుర్గారావు, అక్కయ్యపాలెం

హరిత స్పోర్ట్స్ పార్కు అభివృద్ధికి కృషి



అభివృద్ధిపై చర్చిస్తున్న కమిటీ ప్రతినిధులు

మురళీనగర్ : హరిత స్పోర్ట్స్ పార్కు అభివృద్ధికి సభ్యులు సమైక్యంగా కృషి చేయాలని అధ్యక్షుడు పిల్లా కొండలరావు పిలుపునిచ్చారు. సంఘం సర్వసభ్య సమావేశం పార్కులోని కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యుల సహకారంతో పార్కును సుందరంగా తీర్చిదిద్దామన్నారు. పార్కులో మట్టితో వాకింగ్ ట్రాకు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యదర్శి దరిమిరెడ్డి దేముడు వార్షిక నివేదిక సమర్పించారు. పార్కులో నిర్వహించాల్సిన పనులకు సంబంధించి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును కలిసి వినతిపత్రం అందించామన్నారు. గౌరవాధ్యక్షుడు ఏవీఎన్ రాజు ఆధ్వర్యంలో అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేశారు. కార్యక్రమంలో బి.కిషోర్ పార్థసారథి, కె.సూర్యం, మురళీకృష్ణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో పూడిక తొలగింపు



కాల్వలో చెత్త తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుడు కొండబాబు

సీతంపేట : పది రోజులుగా వ్యర్థాలతో నిండిపోయిన డ్రెయిన్‌ను పారిశుధ్య కార్మికుడు కాల్వలో దిగి చెత్త తొలగించి సరి చేశాడు. జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీ నుంచి చిన్నూరుకు కలిసే కాలువలో చెత్త, తలగడలు, బొంతలు పడేయడంతో మురుగునీరు ప్రవహించే వీలులేక గత 10 రోజులుగా రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. స్థానికుల ఫిర్యాదు మేరకు పారిశుధ్య కార్మికుడు కొండబాబు కాల్వలో దిగి మొత్తం చెత్త తొలగించి సమస్య పరిష్కరించాడు. దీంతో స్థానికులు కొండబాబును అభినందించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నిహారిక, సూపర్‌వైజర్ నాగభూషణం పర్యవేక్షించారు. గెడ్డలు, కాలువల్లో చెత్త వేయకుండా సహకరించాలని, ఇంటికి వచ్చే పారిశుధ్య సిబ్బందికి స్థానికులు అందించాలని సూచించారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం త్యాగాలకు సిద్ధం



దీక్షలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, తదితరులు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఎన్ని రోజులైనా పోరాడేందుకు, ఎలాంటి త్యాగాలకైనా కార్మికులు సిద్ధంగా ఉన్నారని సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. జీవీఎంసీ పార్కులో స్టీల్‌ప్లాంట్ దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. నాలుగు సంవత్సరాల క్రితం ఇదే రోజున ప్రధాని మోదీ స్ట్రాటజిక్ సెల్ పేరుతో స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తున్నట్లు ప్రకటించారన్నారు. నాటి నుంచి నేటి వరకు ఎన్ని అవాంతరాలు వచ్చినా, కోవిడ్ సమయంలో కూడా దీక్షా శిబిరాన్ని కొనసాగిస్తూ కార్మికులు పోరాడుతున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌కి కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం కార్మిక వర్గ పోరాట ఫలితమేనన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ పరిష్కారం కాదని... తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, సొంత గనులు కేటాయించడమే శాశ్వత పరిష్కారమన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ కోసం సొంత గనులు కేటాయించే విధంగా కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, బి.భారతి, కె.మణి, బి.సత్యవతి, సుజాత, వి.కృష్ణారావు, ప్రొఫెసర్ సురప్పడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలు అడ్డుకోవాలి



ఐటీఐ గేటు వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

కంచరపాలెం : ఫీజుల పేరుతో ఇబ్బంది పెడుతున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఆత్మహత్యలను అడ్డుకోవాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు.

ఈ మేరకు కంచరపాలెం ఐటీఐ కూడలిలో గల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం వద్ద ఐక్య వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు పీడీఎస్‌వో ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో జిల్లా అధ్యక్షుడు పి.వి శ్వనాథ్ మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల ఆత్మహత్యలపై ఎంక్వైరీ కమిటీ వేసి ఆయా యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముందుగా ఐటీఐ ప్రధాన గేటు వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లక్ష్మి, సభ్యులు చందు, ప్రేమ్‌కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

23న 'ఇండియన్ మ్యాజిక్' అవార్డ్స్ నైట్



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, బీఎస్ రెడ్డి, తదితరులు

సీతమ్మధార: ఇండియన్ మ్యాజిక్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ ఇంద్రజాలికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 23న కళాభారతి ఆడిటోరియంలో ఇండియన్ మ్యాజిక్ అవార్డ్స్ నైట్ నిర్వహించనున్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రపంచ ప్రఖ్యాత మహేంద్రజాలికుడు డాక్టర్ బీఎస్ రెడ్డి సారథ్యంలో నిర్వహించే ఐఎంఏ అవార్డ్స్ నైట్ గోడపత్రికను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. తమ సంస్థ దశమ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించిన దేశ, విదేశీ మహేంద్రజాలికులకు అవార్డులు అందజేస్తామని బీఎస్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది ఉత్సవాల్లో పీసీ సర్కార్ తనయుడు జూనియర్ పీసీ సర్కార్‌కు జీవన సాఫల్య పురస్కారం, మరో 10 మందికి అవార్డులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ కార్యవర్గం, ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు, మెజీషియన్లు విజయ్ కుమార్, ఎంఏ రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం ప్లంబర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్‌ఎస్ రవికుమార్ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత కలిగిన వారికి ఈ కోర్సులో మూడు నెలలపాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. 15 నుంచి 30 సంవత్సరాలలోపు వయసు గల యువత అర్హులని, వివరాలకు 9866883199లో సంప్రదించాలని కోరారు. శిక్షణ అనంతరం సంబంధిత రంగాల్లో ఉపాధి కల్పిస్తామని తెలిపారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ రజిని, శ్యామల దీపిక

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు కంచరపాలెం పరిధి వివేకానందవీధి, బాపూజీనగర్, శ్రీనగర్ ప్రాంతాల్లో సుమారు రూ.36 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్ చల్లా రజిని, పి.శ్యామలదీపిక సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చల్లా ఈశ్వర రావు, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డులో నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీమహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా ఆలయంలో సోమవారం సాయంత్రం నందీశ్వరుడికి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

- జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని శ్రీ ఉమానీలంకలేశ్వర స్వామి ఆలయంలో నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రామారావు శర్మ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా వీవోఏల దీక్షలు



జీవీఎంసీ పార్కులో రిలే దీక్ష చేస్తున్న ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం

సీతమ్మధార : కూటమి అధికారంలోకి వచ్చాక వీవోఏల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర అలసత్వం వహిస్తోందని ఏపీ వెలుగు వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం, సీఐటీయూ రాష్ట్ర కమిటీ నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు రోజులు రిలే దీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన దీక్షలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా జీతం ఇవ్వాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వం విస్మరించడం దారుణమన్నారు. ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే వీవోఏలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరారు. అక్రమంగా తొలగించిన వీవోఏలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమేనని పేర్కొన్నారు. ప్రతి మండలం నుంచి ఐదుగురు ముఖ్యమైన నాయకులు దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.మణి, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అపర్ణ, కుంచమ్మ, కోశాధికారి శ్రీలక్ష్మి, యూనియన్ ముఖ్య నాయకులు వెంకటలక్ష్మి, పార్వతి, శారద తదితరులు దీక్షలకు నాయకత్వం వహించారు.

ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు విజయవంతం



మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట గోపి

దాబాగార్డెన్స్: ఆంధ్రా యూనివర్శిటీ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్ వేదికగా ఈ నెల 24 నుంచి 26 వరకు నిర్వహించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 43వ రాష్ట్ర మహాసభలు విజయవంతమయ్యాయని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాగంటి వెంకట గోపి తెలిపారు. ఈ మేరకు సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 900 మంది ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. మొదటి రోజు కాంటినెంటల్ కాఫీ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్, భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు పాల్గొన్నారని తెలిపారు. ఏబీవీపీ ప్రతిష్టాత్మకంగా ఇస్తున్నటువంటి శ్రీజనమంచి గౌరీ శంకర్ యువ పురస్కారం సయ్యద్ షహనాజ్‌కు ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ చేతుల మీదుగా అందజేశామన్నారు. ఏబీవీపీ మాత్రమే దేశభక్తిని, దైవభక్తిని విద్యార్థుల్లో నింపి దేశానికి సమర్థవంతమైన నాయకులను అందిస్తుందని శ్రీకాంత్ తెలిపారన్నారు. సమావేశంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు కిరణ్, విశాఖ జిల్లా కన్వీనర్ నితిన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి హరిచంద్రిక, ప్రీతి పాల్గొన్నారు.

